# ఒకరికొకరు వాళ్ళిద్దరూ...



భాగవతుల లలితశర్మ

చేతకాని మొగుడుమీద విరుచుకు పడ్తూన్న గయ్యాళి పెళ్ళాం లాగ సూర్యుడు మండి పడ్తున్నాడు లోకంమీద.

ఉదయం పది గంటలు కాకుండానే ఎండ యింత ఘోరంగా వుంది. పైసుమరి. 'మే' నెల వచ్చేసిందిగా. పరుగులాంటి నడకతో బస్‌స్టాపు చేరుకున్నాను. జనం బాగానే వున్నారు. అంటే బస్సు యింకా రాలేదన్న మాట. అమ్మయ్య అనుకొని అలవాటుగా చుట్టూ చూసేను. చే రుమాలతో మొఖం అద్దుకొంటూ. అంతమంది జనంలోనూ నా దృష్టికి ఏదో వెల్తి అనిపించింది.

'అతను' యీ రోజు ఇంకా రాలేదేమో?' బహుశః వస్తూ వుండాలి.

'అతను రాకపోతే నీ కెందుకు?' అని చాలాసార్లు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. కాని జవాబు దొరకలేదు'

అతను యీ పదో నెంబరు బస్‌స్టాపుకి రోజూ హాజరయ్యేవాళ్ళలో కొత్త మెంబర్.

వారం పది రోజుల క్రితం కాబోలు నేను అతన్ని మొదటిసారి చూసేను. మనిషి చామనఛాయలో వున్నా చూడ్డానికిహుందాగా, బాగానే వుంటాడు. అందం మాట ఎలా వున్నా అతని మొహంలో పుట్టిపడే సభ్యత, సంస్కారం ఎవర్నైనా ఆకర్షిస్తాయి. భగవంతుడు కొందరిలో అన్నీ మంచి లక్షణాలుంచి, 'దిష్టి తగలకుండానా ?' అన్నట్లు కాబోలు ఏదో ఒక లోపం......

నా ఆలోచనలో నే నుండగానే బస్సు వచ్చేసింది. ఆత్రుతగా అటు చూసేను. అదుగో ! వచ్చేస్తున్నాడతను. అతను ఇక్కడికి చేరేలోగా ఈ బస్సు కాస్త కదిలిపోదు కద ! నేను రోజూ యిలా భయపడ్డం, అతను ఎలాగో అలాగ బస్సందుకోడం మామూలయిపోయింది. ఒక్క నిముషం ముందుగావస్తే ఇతని సొమ్మేం పోతుంది! అందరిలాగా కాళ్లు రెండూ లక్షణంగావుంటే వేరే సంగతి.

కాని ఇతనికి పాపం ! కుడికాలు సరిగాలేదు పాదం బాగా అడ్డం తిరిగి వుంటుంది. మోకాలి మిణుకుమీద అరచెయ్యి అన్చందే నడవలేడు ? బస్సులోకి ఎలాగో చచ్చీచెడీ ఎక్కేక ఎవరేనా జాలిపడి యిచ్చిన జానెడు జాగాలో సర్దుకొని కూర్చుంటాడు. లేదా అలానిలబడ్డానికే, తంటాలు పడతాడు తప్ప జాగా అడుగడు.

ఇలాంటి వాళ్లను చూసినప్పుడల్లా, నాకు మా సుజాత జ్ఞాపకం వస్తుంది. నేనూ, తనూ ఒకే కంచంలో తిని పెరగకపోయినా ఒకే స్కూల్లో చదువుకున్నాం. ఒకేకాలేజీలో చదువైందనిపించేం. అందం, ఐశ్వర్యం కలబోసి రాశిపోసినట్లుండే సుజాత అంటే నాకు ఏనాడూ అసూయలేదు. దానివీ, నావీ అభిప్రాయాలు, అభిరుచులు ఎప్పుడూ ఒకటే. కాని ఒకే ఒక విషయంలో మాత్రం నామనసెప్పుడూ బాధతో మూలిగేది.

ప్రపంచంలో బాధలు, బెంగలూ అనేవి వుంటాయా? వుంటేమాత్రం నాకు వాటితో సంబంధమేమిటి ? అన్నట్టుండే తన వింత ధోరణి, కేవలం తన గురించే ఆలోచించే తన మనస్తత్వం నాకు బొత్తిగా నచ్చేదికాదు. పదిమంది స్నేహితురాళ్లకి ఒక వెధవ చెత్త సినిమాకోసం బాల్కనీ టిక్కట్లు కొనిపెట్టే దాని ఔదార్యం బస్‌స్టాండులో తనముందు నిల్చున్న ఒక ముష్టివాడికి ఒక పైస కాదు కద, కనీసం ఒక వేడి నిట్టూర్పుని కూడా ఖర్చుపెట్టడానికి అంగీకరించేదికాదు.

కాలో చెయ్యో వంకరపోయినవాళ్లు ఎదుటపడితే చివాలున ముఖం తిప్పుకొనే సుజా కళ్లలోకి పరీక్షగా చూస్తే నాకు కనిపించేది జాలికాదు, భయంకాదు. భరించలేని అసహ్యం, తనకెంత డబ్బుంటే మాత్రం, రోజూ దానం చెయ్యమని నేనలేను. కాని మనల్ని పుట్టించిన దేవుడే వాళ్లనీ ఈ భూమ్మీద పడేశాడు. ఏదో ఒక లోపాన్ని సృష్టించి ఎలాగో అలాగ బతకండ్రా అంటూ ఈ లోకంలోకి వదిలిపెట్టేడు. మనకంటే క్రిందమెట్టుమీద ఉన్న మనిషికి చెయ్యి ఆసరా ఇవ్వకపోతే పోనీ ! మరింత కిందకి నెట్టాలా ? వాళ్లు మనకి చేసిన అపకారం ఏమిటి ? ఈమాటే నేను ఎప్పుడేనా తనతో అంటే, 'పోనిద్దూ, ఏ జన్మలో చేసుకున్న పాపమో ఈ జన్మలో అనుభవిస్తున్నారు. నువ్వు, నేను జాలిపడి చేసేదేముంది. అటు చూడకపోతేసరి !" అనేది చిరాగ్గా ముఖంపెట్టి.

### పోలికలు

సినిమా టిక్కెట్లకోసం "క్యూ"లో జనంలా
బారులుగా వెళుతున్నాయి కొంగలు.
ఈసారి లాటరీ తప్పక వస్తుందని ఎదురుచూసే
నిరాశా పరుడిలా ఎదురు చూస్తోంది చాతకపక్షి
సంతబజారులో ప్రజలలా హడావిడిగా
అరుస్తున్నాయి కాకులు
ఏ ఒడుదుడుకులకు ఎదురీదాలో ననుకునే
సామాన్యునిలా నిలబడి ఉంది ఏటిలో చిన్ననావ.
ఇదే సంధ్యలో సమాజం
సమాజంలో సంధ్య !

—స్వర్ణ

"నిజమే ! మన జాలివల్ల, వాళ్ల లోపాలు అంతరించిపోవు. కాని, అసహ్యించుకోపోతే, అదేచాలు." ఇలా సాగేవి నా ఆలోచనలెప్పుడూ. దేవుండి సృష్టిలోనే లేని సమానత్వం దేవుడు పుట్టించిన మనుష్యుల్లో ఎలా వస్తుంది ? ఒక్కొక్క రాత్రి నిద్ర పట్టకపోతే 'ఎప్పుడు చూసినది అప్పుడే మర్చిపోక, నే నెందుకిలా ఆలోచిస్తాను ?' అని నామీద నాకే కోపమొచ్చేది.

రోజులు ఎంత రొటీన్‌గా గడిచిపోతున్నా ఏదో ఒక ప్రత్యేకత, ఒక చిన్నమార్పు లేని రోజంటూ వుండదు ఏ మనిషి జీవితంలోనైనా. ఆఫీసు, ఇల్లూ, శ్రీవారు, ఆదివారాలు. బతుకు మరీ బోరుగా, చదివేసిన పుస్తకాన్నే మళ్లీ మళ్లీ చదువుతున్నట్టు మహా విసుగ్గా వుంది.

ఆవేళ ఏమీ తోచడంలేదని శ్రీవారితో కలసి సినిమాకు బయలుదేరాను. సినిమా రిలీజ్ అయిన రోజు అవడంవలన 'రష్'గా వుంది. సినిమా అయిపోయాక జనప్రవాహంలో కొట్టుకొని బయటకు వస్తున్ననాకు రెండో ఆట లైనులో నిలబడ్డ ఒకామెమీద కళ్లు పడ్డాయి అనుకోకుండా. అచ్చు సుజాత లాగే వుంది. కళ్లు పెద్దవిచేసుకొని మరొకసారి చూసేను. సుజాతలాగా ఏమిటి సుజాతే! దాని బారెడు జడ, పెద్ద పెద్ద కళ్లు...... ఎంతటి జనసమర్దంలోనైనా ఇట్టే పోల్చుకోగలిగే రూపం సుజాతది. 'ఉండండి ఇప్పుడే వస్తా!' అని వారికి చెప్పి అటువేపు పరిగెత్తాను. అరె! సుజాత లైనులోపడి ముందుక పోతోంది. ఒక్కసారి ఇటు చూస్తే బాగుణ్ను. 'యే సుజా! ఇటు...! ఇటు...!' మా సుజాతే.నా పిలుపు వింటూనే ఇటు తిరిగింది. తనూ నాలాగే ముందు ఆశ్చర్యపోయింది. ఆ తరువాత ఆనందించినట్టు తన మొహమే చెప్తోంది.

కొంచెం ముందుకొచ్చి 'ఎన్నాళ్లకిచూశానే విజ్జీ !' అంది ఆప్యాయంగా. 'నువ్వు ఇక్కడికెలా వచ్చావు ?' అన్నాను కొంచెం కుదుట పడ్డా 'మా వారికి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయింది. రేపు తప్పకుండా రా. హాయిగా రోజంతా మాట్లాడుకుందాము !' అంటూ వాళ్ల ఇంటిఎడ్రసు చెప్పింది. 'వస్తావుకదూ!' అంటూ ఇంటి గుర్తులు మరొకసారి చెప్పి లైనులో ముందుకు సాగిపోయింది.

ఇంటికివచ్చినా సుజాత ఆలోచనలు నన్ను వదల్లేదు. ఆ కొద్ది క్షణాల వ్యవధిలోనే సుజాతలో వచ్చిన మార్పు కనిపెట్టకలిగేను. ఎప్పుడూ, ఎవరి నేడిపిద్దామా, అన్నట్టుండే ఆ అల్లరి కళ్లలో వెతికినా చిలిపితనం కనిపించడంలేదు ఇప్పుడు. చూపుల్లో స్థిరత్వం చోటు చేసుకుంది ! 'నాకు వున్నంత స్వేచ్ఛ నాపైటకూ వుంది' అన్నట్టు గాలిలోకి అలా వదిలిపెట్టే పైటకొంగును లక్షణంగా కుడిభుజంమీదికి లాక్కొంది ఇప్పుడు. అలా నిండుగా కప్పుకోడంలో ఒక హుందాతనం ఉట్టిపడుతోంది. అందుకే అంటారుకాబోలు ఆడపిల్లలు, ఎలాంటివాళ్లూ పెళ్లవగానే ఆరిందాలై పోతరని ! వాళ్లాయన ఎలా

## ఎడమచెవి వాటమా మీది!?

కుడి చెవికంటే ఎడమచెవి ఇతర శబ్దాలను శీఘ్రంగా గ్రహిస్తుంది, అని మిషిగన్ యూనివర్శిటీ "స్పీచ్ అండ్ హియరింగ్ సైన్సు" లేబొరేటరీకి చెందిన యాంతోనీ, జె. మురాస్కీ, డొనల్డ్ [illegible]. షార్ప్ అంటున్నారు. మాట్లాడే శబ్దాలను గ్రహించటంలో కుడిచెవి ప్రాధాన్యత వహిస్తుంది.

పరిశోధనలు జరుపుతున్నప్పుడు కొందరు వ్యక్తులకు ఒక మాట లేక అక్షరశబ్దాన్ని కలిగించి చూస్తే వారి కుడిచెవి ఆ శబ్దాన్ని ముందుగా గ్రహించిందట. కాని వివిధ స్థాయిలలో జనించే ఇతర శబ్దాలను ధ్వనింపచేసినప్పుడు వారి ఎడమచెవులే ముందుగా గ్రహించాయట. మెదడులో ఎడమభాగం ఎక్కువ ప్రాధాన్యం వహిస్తుందనటానికి ఇదొక నిదర్శనం అని ఈ పరిశోధకులు సూచిస్తున్నారు. రెండు వాక్ శబ్దాలను ఒకేసారి వినవలసి వచ్చినప్పుడు సర్వసామాన్యంగా అత్యధిక సంఖ్యాకులు 'కుడిచెవి' వారే అనవచ్చు.

వుంటాడో? సినిమాకొచ్చినట్టు లేదు! ఇంత అందం, ఐశ్వర్యం పెట్టి పుట్టిన సుజా ఎలాంటి మొగుణ్ణి ఎంచుకుంటుందో తేలిగ్గా ఊహించొచ్చు. ఔను. ఆ మధ్య ఊరెళ్లినప్పుడు అమ్మ చెప్పిందిగా! సుజాకి సంబంధం కుదిరిందే...వరుడు పెద్ద ఆఫీసర్, వెనక బోలెడు ఆస్తికూడా వుంది. అబ్బాయి బాగుంటాడు కూడానూ' అని. అసలు ఎంతో బాగుంటే తప్ప మా సుజాచేసుకోదనినాకు బాగాతెలుసు.

మర్నాడు ఆదివారం! త్వరగా పనులన్నీ ముగించుకొని సుజాతగారింటికి బయలుదేరాను. 'మీరుకూడా రాకూడదా? ఏం చేస్తారు ఇంట్లో ఒక్కరు కూచోని' అంటే, 'నువ్వెళ్ళూ, నేను మరొకసారి వస్తాలే!' అన్నారాయన.

అసలు సంగతి.'ఆదివారమేనా తనివితీరానిద్ర పోవచ్చుకదా రోజంతా'అనిఆయనగారిఉద్దేశం.

నా ఊహ ప్రకారం మంచి ఖరీదైన బంగళా ముందు ఆగాల్సిన రిక్షా, సుజాత ఇచ్చిన అడ్రసు ప్రకారం ఒక చిన్న డాబా ఇంటిముందు ఆగింది. ఈ యిల్లేనా అని సంశయిస్తూనే గేటు తీసుకొని లోపలి కెళ్లాను. వరండాలో ఒకతను ఈజీఛెయిర్‌లో కూర్చుని పేపరు చదువుతున్నాడు. అలికిడి విని పేపరు తొలగించిన ఆ వ్యక్తిని చూసి ఆశ్చర్యంతో అడుగు ముందుకు పడలేదు. అతను అంతకంటె తెల్లబోయి, ఆ వెంటనే తేరుకుంటూ 'నమస్కారం' అన్నాడు నవ్వుతూ. కుర్చీలోంచి త్వరగా లేవాలని ప్రయత్నిస్తూన్న అతనికి ఏమాత్రం సహకరించడంలేదు, ఆ అడ్డంతిరిగిన కుడిపాదం.

ఇంతలో సుజా రానే వచ్చింది. తను అందించిన చెయ్యి అందుకుంటూ లోపలికి దారితీసేను.

ఇల్లు చిన్నదైనా పొందికగా నీట్‌గావుంది.

## ఒకరికొకరు వాళ్ళిద్దరూ...

మంచం మీద కూర్చుంటూ 'ఆ వరండాలో కూర్చున్నాయన ఎవరే సుజా?' అన్నాను. ఏ మరిదో అయ్యుంటాడులే అన్నట్టూ!

"ఇంకెవరు? మా శ్రీవారే! పరిచయం చేస్తాను పద" అంది హాయిగా నవ్వుతూ.

'అతను నాకు రోజూ బస్‌స్టాండులో పరిచయమేలే'అన్నాను.లేనినవ్వుతెచ్చుకుంటూ.

నే నూహించిన రంగుల కల మెల్లిగా కరిగిపోతోంది. మనసు ఎట్టెదుట నున్న వాస్తవాన్ని ఒప్పుకోనని మొరాయిస్తోంది. సుజా తప్పు చేసినదానిలా మొహం పెట్టి, 'రిక్షాలో వెళ్లమని ఎంత చెప్పినా వినరేవిజ్జీ! కాలు సరిగా లేనంత మాత్రాన నలుగురిలో కలిసే అర్హత కూడా లేనట్టేనా?' అంటారు అంటూ ఆ వెంటనే 'నువ్వు పుస్తకాలు చూస్తూ వుండు. నేనిప్పుడే వస్తా' అంటూ లేచి వంటింట్లో కెళ్లిపోయింది. దీనికిదేం అలవాటో, ఇంట్లోకూడా నిండా కప్పుకుంటుంది అనుకుంటూ, ఆ పుస్తకాలు అక్కడే పడేసి నేనూ వంటింట్లోకి దారి తీసేను. అక్కడ వంటింట్లో జరుగుతున్న దృశ్యం చూసి నా మనసు, శరీరం కూడా కొన్ని క్షణాలపాటు కొయ్యబారిపోయేయి. సుజా కాలి బొటనవేలికింద అగ్గిపెట్టెనొక్కిపెట్టి అగ్గిపుల్ల గీస్తోంది. స్టౌ వెలిగించాలని కాబోలు ఈ ప్రయత్నం అంతా. నన్ను చూడగానే 'అలా గుమ్మాని కతుక్కుపోయావేం? వచ్చి కూచో!' అంటూ పీట చూపించింది.

'సుజా, నీ ఎడంచెయ్యి...' అడగాలనుకున్న మాట గొంతులోనే వుండిపోయింది. ఆ మొండిచెయ్యిని చూడలేక ఒక్కక్షణం గట్టిగా మూసుకున్నా కను రెప్పల్ని దాటి వద్దన్నా వచ్చేస్తున్నాయి కన్నీళ్లు.

సుజా వెనక్కితిరిగి వుందేమో, దాని పొడవైన జడ నేలని తాకుతోంది. ఏదో టిఫిన్ తయారుచేసే ప్రయత్నంలో వున్నట్టుంది. 'ఆ బుట్టలో వుల్లిపాయలు, పచ్చిమిరపకాయలు వున్నాయి. ఓ నాలుగు తరిగిపెట్టు. కత్తిపీట నీ పక్కనే వుంది చూడు!' అంది. ఇటు తిరక్కుండానే. 'సుజా! ఆ ఒక్క చేతో ఇప్పుడివన్నీ చెయ్యకపోతే ఏం?' దుఃఖంతో గొంతు నిండిపోయి, మాటలు నోటిలోనే వుండిపోతున్నాయి. మాట్లాడకుండా లేచి ఉల్లిపాయలు తరిగి ఇచ్చేను. సుజాత ఏవో కబుర్లు చెపుతూనే వుంది. 'ఇవాళైతే నువ్వున్నావని మొహమాటం కాని, రోజూ ఈ పనన్నీ ఆయనే చేసిపెడ్తారు. సరేగాని, నిన్న సినిమాలో కలవకపోతే నిన్ను ఎన్నాళ్లకు చూసేదాన్నో కదూ... ఏవిటో అంతా చిత్రంగా అనిపిస్తోంది.'

'ఔను మన బతుకే పెద్ద విచిత్రం' అనుకున్నాను మౌనంగా.

పకోడీలు ప్లేట్లో పెట్టి అందిస్తూ 'ఏమిటలా బొమ్మలా కూర్చుండిపోయేవు? మాటలు మర్చిపోయావా ఏం?' అంది. తను నవ్వుతూ అంటూన్నా కళ్లు మాత్రం శ్రావణ మేఘాల్లా వున్నాయి. మేం ఇలా అనుకోకుండా కలిసి నందుకు సంతోషంగా వున్నా ఓ విధంగా బాధగాకూడా వుండివుంటుంది. అంతవరకు నన్ను చిత్రవధ చేస్తున్న సందేహాన్ని మరి అదుపులో పెట్టుకోలేకపోయేను. 'నిన్నిలా చూస్తాననుకోలేదు సుజా' అన్నాను గొంతు పెకలించుకొని.

'దేముడు నా కళ్లు తెరిపించాలని చెయ్యి పోగొట్టేడే విజ్జీ' అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

'ఉండు! కాస్త మా ఆయన సంగతి చూసివస్తా' అంటు అవతలికి వెళ్లివచ్చింది.

'ఆయనగారు నిద్రలో పడ్డారు' అంటూ తను మరో ప్లేటు అందుకొని, ఇప్పుడు

చెప్తానుండు అంటూ తీరిగ్గా కూర్చుంది.

'ఆరోజు - అంటే మా పెళ్ళి జరగాల్సిన రోజుకి నెల్లాళ్ళముందు షాపింగుకని బయలు దేరి తిరిగి వస్తున్నా. మనసు మధురోహల్లో తేలిస్తూ వుంటే ఖర్మ ఇలా కారుకిందకి తోస్తుందనుకోలేదు- షాపు మెట్లుదిగి రిక్షా కోసమని ఇలా నాలుగడుగులు వేసేనోలేదో...

## ఒకరికొకరు: వాళ్ళిద్దరూ...

అంతే! అంతా క్షణాలమీద జరిగిపోయింది. ఈ చెయ్యి తీసెయ్యాలని డాక్టర్లు చెప్పినప్పటికంటే, ఇలా జరిగిందని తెలిసి అబ్బాయి తల్లిదండులు మరో పదివేలు కట్నం పెంచినప్పుడు మాత్రం మొట్ట మొదటిసారి నా మీద నాకే జాలేసింది. అక్కడికీ మావాళ్ళు ఆ సంబంధం చెయ్యడానికే సిద్ధపడ్డారు. అబ్బాయి మంచి ఉద్యోగంలో వున్నాడు, అందగాడు అంటూనూ కానుమరి డబ్బుగలవాళ్ళం కాబట్టి నాలోని లోపాన్ని మరో పదివేలతో కప్పిపుచ్చగలరు. పెళ్ళంటూ జరుపగలరు- కాని ఆడబ్బే లేకపోతే నాగతి... నాకుమాత్రం అలాంటి పెళ్ళి చేసుకోనేకంటే ఇలా ఉండిపోతే నయం అనిపించింది. ఆ సంబంధంతప్పిపోడం,నేనిలా తయారవడంతో నాన్నగారు బెంగతో కుంగిపోయేరు. అమ్మ సంగతి సరేసరి. కానీ విజ్జీ! ఓ గమ్మత్తు చూసేవా? మనం భూమ్మీద పడకముందే దేముడు మన జీవితాలని ఎవరితో ముడిపెట్టి వుంచాలో ముందే నిర్ణయించు కుంటాడు కాబోలు. ఇతను నాన్నగారి ఆఫీసులోనే పని చేస్తూ వుండేవారు. సంగతి తెలిసి తనే స్వయంగా ఈ పెళ్ళికి అంగీకరించారు. నాకు అదే న్యాయమనిపించింది. 'మే మిద్దరం ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం' కనుక యీ జీవితం సాఫీగా సాగిపోతోంది! అంది తృప్తిగా నవ్వుతూ.

'విజ్జీ మన చిన్నతనం జ్ఞాపకం వుందా! ఈ విషయంలోనే పోట్లాడుకొని రెండేసి రోజులు మాటలు కూడా మానేసేవాళ్ళం. అవి తల్చుకుంటే ఏదోగా వుంటుందిప్పుడు. జీవితం అంటే ఏమిటో తెలీక, కలల్లో తేలిపోయే రోజులవి వాస్తవాన్ని రుచి చూస్తున్న రోజులివి. నువ్వు నమ్మవేమో కాని నాకీ జీవితం చాల తృప్తిగా వుంది. 'బహుశః ఇప్పటి నా పరిస్థితిని బట్టి' అని నువ్వనుకున్నా అందుకు అభ్యంతరంలేదు. జీవితాన్ని అర్థంచేసుకొని పరిస్థితులలో రాజీపడ్డం లోనే.వుందిఅసలు ఏ మనిషికేనా తృప్తి అన్నది.'

సుజాతే నాకలామాట్లాడుతోంది! పాన్నే, ఒకళ్ళ ఓదార్పువలసిపరిస్థితిలోలేదుఅదేచాలు!

నన్ను గేటుదాక సాగనంపుతూ తను చూసిన చూపులు ఎప్పటికీ నా మనసులో అట్టడుగు పొరల్లో ఎక్కడో అలా అలా కదుల్తూనే వుంటాయి. వాటి అర్థం మనం దేన్నయితే ఎక్కువగా ఏవగించుకొని, తప్పుకు తిరగాలని చూస్తామో దాన్నే దేముడు మన జీవితాలకి ముడిపెట్టి 'వీళ్ళు రాజీపడగలరా లేదా' అని చూస్తాడు. "ఏమయితేనేం? నే నోడిపోలేదు' మేమిద్దరం ఒకరి కొకరం చేదోడు వాదోడు సరిజోడు కూడాను" అన్నట్లుగా అనిపించింది.


80 × 80 జెమినీ లుంగీలు, మూడు గుర్రములు, ఎగ్ & బర్డ్ మార్కులు లుంగీలనే వాడండి.




బయటి వూళ్ళ ఆర్డర్లు వెంటనే గమనించబడును.

పండుగలు, పర్వదినాలు
సంతోష సమయాలు

అందంగా హుందాగా వుండాలనుకునే వారి ఎన్నిక.
రంజాన్ పండుగలో "గ్వాలియర్" షూటింగ్ షర్టింగ్ లలో మీ ప్రత్యేకత చూడండి. పండుగ సందర్భములో ఖరీదుపై ఉచిత బహుమతులు పొందండి.

గ్వాలియర్ షూటింగ్ షోరూం,
"శ్రీ లక్ష్మి"
కొత్తగూడెం
(శ్రీ లక్ష్మి క్లాత్ స్టోర్సు బిల్డింగ్ పైన)

BAP